# సీఎం సభకు భారీ బందోబస్తు



సీఎం సభావద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రితిరాజ్

- 300పైగా పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా నిఘా
- జిల్లా ఎస్పీ రితి రాజ్

గద్వాల అర్బన్ నవంబర్ 5 : సీఎం సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఆధ్వర్యంలో సభ సజావుగా జరిగేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ రితి రాజ్ పేర్కొన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని సీయం సభ వేదికను పోలీస్‌ల ప్రత్యేక నిఘా బృందంతో పాటు జాగిలతో సభ వేదికనంతట పరిశీలించారు.ఈ క్రమంలో ఎస్పీ రితి రాజ్ మాట్లాడుతు సీయం సభకు ఎస్పీతో పాటు 2 ఏఎస్పీ,6 మంది డీఎస్పీలు,13 మంది సీఐలు,34 మంది ఎసైలతో పాటు మొత్తం 300 మందిపైగా పోలిస్ సిబ్బందితో సీయం సభకు నిఘా ఉంచినట్లు తెలిపారు.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలిస్ అధికారులను,సిబ్బందిని అప్రమత్తం చేస్తు ఎక్కడ కూడా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.అలాగే సీయం సభకు వచ్చే ప్రజలు పోలిస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలన్నారు.సోమవారం జిల్లా కేంద్రంకు సీయం సభకు వచ్చే ప్రజలు తమ వాహనాలు పోలీస్ అధికారులు సూచించిన పార్కింగ్ ప్రదేశాలలో నిలిపివేయాలని సూచించారు.జిల్లా కేంద్రంలో ఎక్కడ కూడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవి,డీఎస్పీ వెంకటేశ్వర్లు,సీఐలు శ్రీనివాస్, రామస్వామి,ఎసై శ్రీకాంత్,అబ్దుల్ షుకుర్,ఆనంద్ తదితరులు ఉన్నారు.

## పాముకాటుకు మహిళ మృతి

ఇటిక్యాల, నవంబర్ 5 : మండలంలోని వావిలాల గ్రామంలో పాముకాటుకు మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి రాధిక(31) రాత్రి నిద్రించే సమయంలో పాముకాటుకు గురైంది. అయితే ఆమె గమనించక ఎప్పటిలాగే ఆదివారం ఉదయం ఇంటి ముందు పాచిపనులు చేస్తూ అపస్మారక స్థితికి చేరుకొంది. దీంతో భర్త రాముడు గ్రామస్తులు ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో తరలించగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. పేద కుటుంబానికి చెందిన ఆమె భర్త చిన్నవ్యాపార దుకాణం నడుపుతూ మెకానిక్ పనిచేసుకొంటూ జీవనం చేస్తున్నాడు.

## తిరుపతిలో సంకీర్తనల ఆలాపన



తిరుమలలో సంకీర్తనలు ఆలపిస్తున్న మారుతి భజన మండలి సభ్యులు

అయిజ, నవంబర్ 5 : మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామానికి చెందిన మారుతి భజన మండలి సభ్యులు హరినామ భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు తిరుమలకు చేరుకున్న భజన మండలి బృందం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తనలు ఆలపించి దేవస్థాన అధికారులచే మెప్పు పొందారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు వెంకట్రాములు, సూర్య, వెంకటన్న గౌడ్, చిన్న వెంకటన్న, బీచేంద్ర, వెంకటేశ్, రాఘువేంద్ర, పూజారి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎలమంద దరహాసం

- గొర్రెల యూనిట్లతో ఆర్థికాభివృద్ధి



గొర్రెల మందతో లబ్ధిదారుడు

మానవపాడు, నవంబర్ 5 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అనుభవించిన గోస చెప్పుకుంటే పోయేదీకాదు. ఎటుచూసినా అంధకారం, ఉద్యోగాలు లేవు, కరెంటు లేదు, మొత్తంగా బతుకే లేకుండా పోయింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణ రూపురేఖలు మారిపోయాయి. ఒక్కోరంగాన్ని గాడిన పెడుతూ కేసీఆర్ తీసుకొచ్చిన విప్లవాత్మక పథకాలు తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపాయి. ఆ ఫలితాలు ఇప్పుడు కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రతివర్గాన్ని మేలు చేసేలా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ఆయావర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాయి. అలాంటి వాటిలో గొర్రెల పథకం ఒకటి. కులవృత్తుల వారు కునారిల్లి చెట్టుకొకరు పుట్టకొకరు అయిన వేళ తీసుకొచ్చిన ఈ పథకం మళ్లీ వారందరికి కులవృత్తుల వైపు మల్లేలా చేసింది. కూలీకెళ్తూ పాలేర్లుగా పనిచేస్తూ జీవితాన్ని నెట్టుకొచ్చిన ఎందరో నేడు యజమానులుగా మారి సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. ప్రతిఇంటికీ ఒక సంక్షేమ పథకం అందితే ఆర్థికంగా పరిపుష్టి సాధించి కుటుంబాలు బాగుపడతాయనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ పథకం అమలు చేశాడు. దేశంలో ఎక్కడా లేని విధంగా గొల్ల కురుమలు ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న గొర్రెల పంపిణీ పథకం అద్భుతం చేస్తోంది. వారి జీవితాల్లో ఆర్థిక పరిపుష్టిని నింపుతోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన ఈ పథకంతో అనతి కాలంలోనే గొర్రెల సంపద అమాంతం పెరిగి గొల్ల కురుమలను శ్రీమంతులను చేసింది. ఎక్కడా చూసిన గొర్రెలమందలు దర్శినమిస్తున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం కూడా అలాంటి సంక్షేమ పథకాలు చేయకపోవడం పంటలు పండక కరువు చాయలతో అలమటించిన ప్రజలకు ఈ పథకం వరంలా మారింది. మొదటి విడుత గొర్రెల పంపిణీ పూర్తయి రెండోవిడుత పంపిణీ ప్రారంభించింది. పారదరర్శకంగా పంపిణీ చేసేందుకు విప్లవాత్మక మార్పులు చేసింది. లబ్ధిదారుల వాటా మొదలుకొని వేరే రాష్ట్రాలకు వెళ్లి గొర్రెలు కొని స్వస్థలం చేరేంత వరకు అడుగడుగున నిఘా ఏర్పాటు చేసింది. గొర్రెల యూనిట్లు అందుతుండడం ఆదాయం పెరుగుతుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.


### గొర్రెలు ఉంటే పైసలు ఉన్నట్టే ..



మా పెద్దలకు గతంలో గొర్రెలు ఉండేవి పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో వాటిని అమ్మేశారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. నాతోపాటు నా అన్నలకు రెండు యూనిట్లు మంజూరయ్యాయి. అన్నింటిని గుంపుగా చేసి పెంచుకుంటున్నాం. 60 గొర్రెల మంద ఇప్పుడు ఆరు వందలకు చేరుకుంది. ఇంట్లో గొర్రెలు ఉంటే పైసలు ఉన్నట్టే మనకు కష్టం వచ్చినా డబ్బులు అవసరమైనా , గొర్రెలు అమ్మితే డబ్బులు వస్తాయి. గతంలో డబ్బులు అవసరమైతే అప్పులు చేయాల్సి వచ్చేది. ఎక్కువ మిత్తికి తెచ్చుకుని కాలం వెల్లబుచ్చేవాళ్లం. ఇపుడు ఆ పరిస్థితి లేదు.మేము ఇప్పటి వరకు 4 లక్షల విలువైన గొర్రెలు అమ్మాం ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించడానికి చేపట్టిన గొర్రెల పంపిణీ వల్ల మాలాంటి వాళ్లకు ఉపాధి ఎంతో మెరుగుపడింది.

**- రాముడు. లబ్ధిదారుడు మానవపాడు**

## ఆర్డీఎస్ ఆనకట్టకు పెరుగుతున్న వరద



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

అయిజ, నవంబర్ 5 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పెరుగుతోంది. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో మోస్తారులో కురుస్తున్న వానలకు ఆనకట్టకు ఇన్‌ఫ్లో చేరుతోంది. ఆదివారం 834 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 734 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 438 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.2 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. ఎగువన ఉన్న తుంగభద్రా జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 9,066 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 28.966 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 1605.16 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి, నవంబర్ 5 : ఆదివారం వెంటాపురం గ్రామంలో కేటీదొడ్డి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక ట్రాక్టర్ పట్టుబడిన ఘటన వెంటాపురం గ్రామ శివారులో చోటు చేసుకున్నది. కేటీదొడ్డి ఎస్సై వెంకటేశ్ తెలిపిన సమాచారం మేరకు మండలంలోని కర్ణాటక రాష్ట్రంలోని యాపల్‌దిన్నె గ్రామంలోని వాగు నుంచి ధరూర్ మండలంలోని అల్లపాడు గ్రామంలోకి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యాపల్‌దిన్నె గ్రామానికి చెందిన రాముడుది అని ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

# భక్తి ప్రవత్తులతో మెలగాలి

- హల్దిపూర్ పీఠాధిపతి వామనేశ్వరస్వామి



లక్షపుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

అయిజ, నవంబర్ 5 : సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తి ప్రవత్తులతో మెలగాలని కర్ణాటక రాష్ట్రంలోని హల్దిపూర్ పీఠాధిపతి వామనేశ్వరస్వామి సూచించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు శుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో వాసవీ మాతా ఆలయాల్లో కోటి పుష్పార్చన కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ప్రతిపట్టణం,గ్రామాల్లోని వాసవీమాతా ఆలయాల్లో లక్షపుష్పార్చన వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.